
ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

సిద్దిపేట

5

గురువారం 9 మే 2024





ఐదునెలల్లోనే ఆగం చేశారు

- బీఆర్‌ఎస్ పాలనలో ఉమ్మడి జిల్లా అన్ని విధాల అభివృద్ధి
- పారిశ్రామికవాడ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం
- నర్సాపూర్, పటాన్‌చెరు రోడ్‌షోలలో బీఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్

నర్సాపూర్, మే 8: రేవంత్ ప్రభుత్వం ఐదు నెలలకే ఆగమాగం చేసిందని బీఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ధ్వజమెత్తారు. బీఆర్‌ఎస్ పాలనలో ఉమ్మడి మెదక్ జిల్లా అన్ని విధాల అభివృద్ధిలో ముందుకుసాగేదని, కాంగ్రెస్ పాలనలో ఈ ప్రాంత ప్రగతి కుంటుపడిందని విరుచుకుపడ్డారు. మెదక్ పార్లమెంటు బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రామారెడ్డికి మద్దతుగా బుధవారం సాయంత్రం నర్సాపూర్ పట్టణంలోని ప్రధాన చౌరస్తా వద్ద నిర్వహించిన రోడ్డుషోలో కేసీఆర్ ప్రసంగించారు. నర్సాపూర్ నియోజకవర్గానికి సాగు నీటి కోసం కోమటిబండ నుంచి ప్రత్యేక పైపులైన్ వేయించిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదేనన్నారు. మల్లన్నసాగర్ నుంచి కాళేశ్వరం కాలువ ద్వారా ఈ ప్రాంతానికి సాగునీరు అందించాలనే ఉద్దేశంతో పనులు మొదలుపెట్టామని, అది పూర్తయితే నియోజకవర్గం బంగారుతునక అయ్యేదన్నారు. గిరిజనులకు ప్రత్యేకంగా పదిశాతం రిజర్వేషన్ ఇవ్వాలని తాము నిర్ణయం తీసుకుంటే, కేంద్ర ప్రభుత్వం అడ్డుకుందని, దాని గురించి ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. పోడు భూములకు పట్టాలిచ్చి వారికి సర్వహక్కులు కల్పించిన ఘనత తమదేనన్నారు. నర్సాపూర్ మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేకంగా రూ.25 కోట్లు మంజూరు చేస్తే ఈ కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని వాపస్ తీసుకుని పనులు కాకుండా అడ్డుకుందని కేసీఆర్ విమర్శించారు. మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ఇచ్చిన వాటిని అమలు చేయాలంటే యుద్ధం చేయాల్సిందే అని, అందుకు మెదక్ ఎంపీగా వెంకట్రామారెడ్డిని గెలిపించాలని కోరారు. కేంద్రంలోని బీజేపీ వల్ల తెలంగాణకు పైసా లాభం లేదన్నారు. పేదలు, యువకులు, రైతులు కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాయమాటలు నమ్మి వారి ఉచ్చులో పడొద్దని సూచించారు.

ముసలితనానికి కుసుమ గుడాలన్నట్లు..

నర్సాపూర్ రోడ్డుషోలో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. మదన్‌రెడ్డి తెలుగుదేశంలో ఉన్న సమయంలో రెండుసార్లు ఓడిపోయాడని, తాను బీఆర్‌ఎస్‌లోకి తీసుకొచ్చి రెండుసార్లు ఎమ్మెల్యేను చేశానని గుర్తుచేశారు. 'ఆయన పార్టీ ఎందుకు మారారో.. ఈ ముసలితనానికి కుసుమ గుడాలన్నట్టు ఇప్పుడెల్లి ఏమి చేస్తాడు' అని కేసీఆర్ తీవ్రస్థాయిలో విమర్శించారు.

దారిపొడవునా జననీరాజనం

గజ్వేల్/తూప్రాన్, మే 8: ఎర్రవెల్లి ఫాంహౌజ్ నుంచి కేసీఆర్ నర్సాపూర్‌కు రోడ్డు మార్గం గుండా భారీ కాన్వాయ్‌తో బయలుదేరగా దారిపొడవునా జనం నీరాజనం పలికారు. గజ్వేల్, తూప్రాన్ పట్టణాల్లో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం తెలిపారు.

పటాన్‌చెరు పోలీసులు అతి చేస్తున్నారు జాగ్రత్త!

పటాన్‌చెరు, మే 8: పటాన్‌చెరు పోలీసులు అధికార పార్టీకి వత్తాసు పలుకుతూ అతి చేస్తున్నారని మాజీ సీఎం, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం పటాన్‌చెరులో నిర్వహించిన రోడ్‌షోలో ఆయన ప్రసంగించారు. వచ్చేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమని జాగ్రత్త అని హెచ్చరించారు. పోలీసులు తమ బాధ్యత నిర్వర్తించాలని రాజకీయాలలో వేలు పెట్టొదన్నారు. ఉపాధికి కేంద్రంగా ఉన్న పటాన్‌చెరును మరింత అభివృద్ధి చేయాలని, తాము పారిశ్రామికవాడ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్నారు. పరిశ్రమలకు నాణ్యమైన విద్యుత్ 24 గంటలు ఇవ్వడమ వల్లే ఉపాధి అవకాశాలు పెరిగాయన్నారు. మంచి పారిశ్రామిక విధానాల వల్ల అనేక కొత్త పరిశ్రమలు వచ్చాయన్నారు.



పటాన్‌చెరు రోడ్‌షోలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్, పక్కన మెదక్ పార్లమెంటు బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రామారెడ్డి

ఈ రోడ్‌షోలలో ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డి, మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యేలు సునీతాలక్ష్మారెడ్డి, మహిపాల్‌రెడ్డి, చింతా ప్రభాకర్, జడ్పీ ఛైర్‌పర్సన్ మంజుశ్రీజైపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ ఫారూక్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు నర్సాపూర్‌కు రాహుల్‌గాంధీ

- 4 గంటలకు భారీ బహిరంగ సభ

నర్సాపూర్, మే 8: ఎన్నికల ప్రచారంలో భాగంగా మెదక్ పార్లమెంటు పరిధిలోని నర్సాపూర్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు అగ్రనేత రాహుల్‌గాంధీ హాజరుకానున్నారు. నర్సాపూర్-వెల్దుర్తి మార్గంలోని ఖాళీ స్థలంలో బహిరంగసభకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సాయంత్రం 4 గంటలకు రాహుల్‌గాంధీ హాజరై ప్రసంగించనున్నారు. వేదికపై రెండు వందల మంది వరకు కూర్చునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. పార్లమెంటు పరిధిలోని అసెంబ్లీ సెగ్మెంట్ల నుంచి భారీ ఎత్తున జనాన్ని తరలించడానికి కసరత్తు చేస్తున్నారు. రాష్ట్ర దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, ఏఐసీసీ ఇన్‌చార్జి సురేష్, స్థానిక నాయకులతో కలిసి బుధవారం సభ ఏర్పాట్లను పరిశీలించారు.

పోస్టల్ బ్యాలెట్‌కు 10 వరకు గడువు పెంపు

- ఎన్నికల అధికారి, సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి రూరల్, మే 8 : ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కుని వినియోగించుకునేందుకు 10వ తేదీ వరకు గడువును పొడిగించినట్టు ఎన్నికల అధికారి, సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మరకు గడువుని పొడిగించామని పేర్కొన్నారు. కొత్తగా పోస్టల్ బ్యాలెట్ ఓటు కోసం నమోదు చేసుకునే అవకాశం లేదని, నిర్ణీత సమయంలో నమోదు చేసుకుని పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కుని వినియోగించుకోలేని వారికి మాత్రమే అవకాశం కల్పించిందని స్పష్టం చేశారు. జిల్లాలో ఐదు నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రాల్లో 10వ తేదీ వరకు పోస్టల్ బ్యాలెట్లు సమర్పించవచ్చని ఆమె వివరించారు.

రేవంత్ పాలనపై బీజేపీ, బీఆర్‌ఎస్ కుట్ర

- కులం, మతం పేరుతో రాజకీయంగా ఎవరు సక్సెస్ కాలేరు
- ప్రభుత్వానికి ప్రజలంతా అండగా నిలవాలి
- రవాణా, బీసీ సంక్షేమశాఖ మంతి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్ రూరల్/అక్కన్నపేట, మే 8: కులం, మతం పేరుతో రాజకీయం చేసిన పార్టీలు ఇప్పటి వరకు ఎక్కడ సక్సెస్ కాలేదని కులంపై అభిమానం ఉండాలి కాని కులోన్మాదం ఉండకూడదని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బుధవారం హుస్నాబాద్‌లోని ఓ కన్వెన్షన్‌హాల్‌లో రెడ్డి బంధువుల ఆత్మీయ సమావేశానికి మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరై మాట్లాడారు. అలాగే, అక్కన్నపేట మండలంలోని మల్లంపల్లిలో పలువురు బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరిన సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతు పక్షపాతిగా పేదల సంక్షేమం కోసం నిరంతరంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి రేవంతరెడ్డి పరిపాలనను జీర్ణించుకోలేని కేసీఆర్, బీజేపీ కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. పదేళ్ల దేశంలో పాలించిన మోదీ ప్రభుత్వం, రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చి అమలు చేయలేదన్నారు. పేదల సంక్షేమం కోసం పనిచేసే కాంగ్రెస్ పార్టీకి ప్రజలు ఆదరణ చూపుతుంటే ఆ రెండు పార్టీలకు నిద్రపట్టడం లేదన్నారు. యువ నాయకుడు రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను 5 నెలల్లో అమలు చేస్తుంటే ఆ పార్టీలకు మింగుడుపడడం లేదన్నారు. రాష్ట్రంలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు వంద రోజుల్లోనే అమలు చేస్తుంటే తమ పార్టీలకు భవిష్యత్ లేకుండాపోతుందనే భయంతో రేవంత్‌రెడ్డి పరిపాలనపై బురదజల్లే కుట్రలకు పూనుకుంటున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు రూ. 2లక్షల రుణ మాఫీ ఆగస్టులో చేస్తామని, ఇందిరమ్మ ఇండ్లు, రైతులకు పంటలకు బోనస్ ఇస్తామన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో రెడ్డి బంధువుల కోసం సొసైటీ ఏర్పాటుకు రూ. 50 లక్షలు మంజూరు చేశామని, ఇంకా అదనంగా మరో రూ. 50 లక్షలు కావాలని కోరుతున్నారని అందుకోసం కృషిచేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు. రైతు రుణవిముక్తి సమన్వయ సమితి మాజీ సభ్యులు కవ్వ లక్ష్మారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాజీ సర్పంచ్ మడప జైపాల్‌రెడ్డి, కర్నకంటి మంజులారెడ్డి, చిగురుమామిడి, కోహెడ, అక్కన్నపేట, భీమదేవరపల్లి, ఎల్కతుర్తి నాయకులు మల్లారెడ్డి, అశోక్‌రెడ్డి, జగన్‌రెడ్డి, రాజిరెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

సుప్రీం కోర్టు మాజీ జడ్జిని కలిసిన కలెక్టర్



మాజీ జడ్జిని కలిసి పూలమొక్కను అందజేస్తున్న సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి

కొండపాక, మే 8 : సుప్రీంకోర్టు మాజీ జడ్జి, కాళేశ్వరం ప్రాజెక్టు విచారణ కమిషన్ కమిషనర్ పినాక చంద్రఘోష్‌ను కొండపాక మండలం నాగులబండ వద్ద గల హరితా మినర్వా హోటల్‌లో బుధవారం కలెక్టర్ మనుచౌదరి మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. పినాక చంద్రఘోష్ రామగుండం నుంచి హైదరాబాద్‌కు రోడ్డు మార్గంలో వెళ్తున్న క్రమంలో హోటల్‌లో తేనీటి విందు స్వీకరించి కాసేపు విశ్రాంతి తీసుకుని వెళ్లారు. ఆయనను కలిసిన వారిలో పోలీస్ అడిషనల్ డీసీపీ అడ్మిన్ మల్లారెడ్డి, నీటిపారుదలశాఖ ఈఎన్‌సీ హరిరాం, పలువురు ఉన్నారు.

గెలిచిన ఎంపీలను కేసీఆర్ బీజేపీకి అప్పగిస్తారు

- కవితను కాపాడటానికే ఈ తండ్లాట
- ఆంధ్ర సీఎం జగన్ లాగా ప్రభాకర్‌రెడ్డి కోడి కత్తి డ్రామాతో గెలిచాడు!
- తెలంగాణకు బీజేపీ గాడిద గుడ్డు ఇచ్చింది : మంత్రి కొండా సురేఖ



తొగుటలో మాట్లాడుతున్న మంత్రి సురేఖ

దుబ్బాక/తొగుట మే8: బీజేపీ, బీఆర్‌ఎస్ మధ్య చీకటి ఒప్పందం ఉందని, ఈ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపిస్తే వారిని కేసీఆర్ బీజేపీకి అప్పగిస్తారని రాష్ట్ర స్త్రీ, శిశుసంక్షేమశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. కేసీఆర్ డ్రామాలను తెలంగాణ ప్రజలు నమ్మబోరని, తన బిడ్డ కవితను కేసుల నుంచి కాపాడడానికే ఈ తండ్లాట అని ఆమె తెలిపారు. బుధవారం దుబ్బాక పట్టణంలో చేపట్టిన రోడ్‌షోలో, కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అలాగే తొగుట మండల కేంద్రంలో ప్రచారంలో భాగంగా మాట్లాడారు. దుబ్బాక అభివృద్ధి కేవలం కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. తమ పార్టీ ఎమ్మెల్యేను గెలిపించకపోయినప్పటికీ తాము దుబ్బాక అభివృద్ధికి రూ.40 కోట్లను అందించామన్నారు. దుబ్బాక నుంచి నిలబడిన బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు ఎమ్మెల్యేగా ఒక్కపైసా అభివృద్ధి చేయలేదన్నారు. అంబానీ, అదానీలకు తప్ప మోదీ ప్రభుత్వం సామాన్యులకు ఏమాత్రం ఉపయోగంలేదన్నారు. ఆంధ్ర సీఎం జగన్ లాగా దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి కోడికత్తి డ్రామాతో గెలిచి ఇప్పటి వరకు ఈప్రాంత ప్రజలకు ముఖం చూపించడం లేదని కొండా సురేఖ మండిపడ్డారు. మెదక్ ఎంపీగా కొత్త ప్రభాకర్‌రెడ్డి ప్రజలకు ఏమీ చేయలేదని, ఎమ్మెల్యేగా గెలిచి ఇపుడు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. కొత్త ప్రభాకర్ రెడ్డి ఇటు వైపు మరోసారి ఓట్ల కోసం వస్తే కర్రలతో దాడి చేసి కాళ్లు విరగగొట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. దుబ్బాక నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసింది స్వర్గీయ చెరుకు ముత్యంరెడ్డి మాత్రమేనని చెప్పారు. మల్లన్నసాగర్ నిర్వాసితులను ముంచిన బీఆర్‌ఎస్ అభ్యర్థికి ఓటు వేయవద్దని, నిర్వాసితుల సమస్యలు తాము పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. దేశంలో ప్రధాని అయ్యేది కేవలం రాహుల్‌గాంధీ మాత్రమేననీ గ్రహించాలన్నారు. బీజేపీపాలనకు ప్రజలు చరమగీతం పాడనున్నారన్నారు. ఆమె వెంట నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, తొగుట ఎంపీపీ లతా నరేందర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు అక్కం స్వామి, నాయకులు చెరుకు విజయ్‌రెడ్డి, గాల్‌రెడ్డి ఉన్నారు.

రైలు ఢీకొని యువకుడి మృతి

- ఇయర్‌ఫోన్స్ పెట్టుకుని బైక్‌పై ట్రాక్ దాటుతుండగా ఘటన
- భయంతో పారిపోయిన మరో యువకుడు

7లో..

పొగచూరిన బతుకులకు భరోసా ఏది?

- బీడీ కార్మికుల ఓట్ల కోసం నాయకుల పాట్లు
- సంక్షేమాన్ని పట్టించుకోని పార్టీలు
- కలగానే సిద్దిపేట ఈఎస్‌ఐ ఆస్పత్రి
- పిల్లల ఉపకార వేతనాలకు చెల్లుచీటీ
- పదిరోజులే పని దినాలు.. సంక్షోభంలో బీడీ కార్మికులు!!

దుబ్బాక, మార్చి 3 : మెదక్ పార్లమెంట్ పరిధిలోని బీడీకార్మికుల ఓటు బ్యాంకు ప్రధానం కానుంది. అయితే బీడీ పరిశ్రమనే నమ్ముకుని బతుకుతున్న వారు ఇప్పుడు భరోసా కోసం ఎదురుచూస్తున్నారు. బీడీ పరిశ్రమ, సంక్షేమం ప్రధానంగా కేంద్రకార్మికశాఖ పరిధిలో ఉండడంతో ఈ ఎన్నికల్లో తమను అక్కున చేర్చుకుని, తమ సమస్యలు పరిష్కరించే పార్టీలు ఏవనేది కార్మికుల మనస్సుల్లో మొదలుతుంది. ఈ తరుణంతో ప్రధాన పార్టీల ప్రచారంలో బీడీ కార్మికుల ఎజెండానే ప్రధానాంశంగా మారుతుంది. ఇటీవల బీఆర్‌ఎస్ అభ్యర్థి తరపున ప్రచారం చేసిన మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు బీడీ కార్మికులను ఆకర్షించేందుకు వారి సమస్యలే ప్రధాన ఎజెండాగా ఎంచుకున్నారు. దుబ్బాక పర్యటనలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కూడా బీడీ కార్మికులకు తనదే భరోసా అంటూ వారిని ఆకర్షించే ప్రయత్నం చేశారు. మెదక్ పార్లమెంట్ పరిధిలో సుమారు 1.15లక్షల మంది (పీఎఫ్, నాన్‌పీఎఫ్) కార్మికులుంటారు. బీడీ పరిశ్రమను నమ్ముకుని, రిటైర్డ్ అయిన కార్మికులు దాదాపు 65 వేల మంది ఉంటారు. ఈ ఎన్నికల్లో బీడీ కార్మికులు కూడా ప్రధాన భూమిక పోషించనుండడంతో టేకేదారులు, మునీంలను ప్రసన్నం చేసుకునే పనిలో ఆయా పార్టీలు నిమగ్నమయ్యాయి.

శరఘాతంగా ముసాయిదా బిల్లు, జీఎస్టీ

కేంద్రం ప్రతిపాదించిన నూతన ముసాయిదా బిల్లుతో బీడీ రంగం పూర్తిగా దివాలా తీస్తుందనే చెప్పాలి. బీడీ అమ్మకందారులపై భారీ జరిమానాలు, ప్రచార అంక్షలతో పాటు కొత్తగా 32 సవరణల మూలంగా బీడీ యాజమాన్యాలు లాకౌట్ దిశగా అడుగులు వేస్తున్నాయి. ఇదీ ముమ్మాటికీ సిగరెట్ కంపెనీలకు లాభం చేకూర్చి, చిన్నపరిశ్రమలుగా ఉన్న బీడీ పరిశ్రమలను మూసేసే కుట్రలున్నాయనే ఆరోపణలున్నాయి. పుర్రెగుర్తు, సరైన పనిదినాలు లేకుండా సాగుతున్న బీడీ పరిశ్రమ ఇప్పుడు జీఎస్టీ 28 శాతం విధించడంతో పూర్తిగా సంక్షోభంలోకి కూరుకుపోతోంది. ఇదే సాకుతో కనీస వేతన చట్టం అమలును కూడా వాయిదా వేస్తూ వస్తున్నారు.

సంక్షేమాలు కూడా దూరమే...

బీడీ కార్మిక సంక్షేమాలు కూడా ప్రభుత్వాలు విస్మరించాయి. పదేండ్లుగా బీడీ కార్మికులకు సొంతగృహాలు కల్పించాల్సిన కార్మిక గృహ నిర్మాణశాఖ నిర్వీర్యమైంది. దీంతో వారికి సొంతిల్లు కలగానే మిగిలింది. గతంలో కేంద్ర కార్మిక సంక్షేమ శాఖ నుంచి బీడీ కార్మికులకు గృహరుణాలను అందించే వీలుండేది. ప్రస్తుతం ఆ పథకం పూర్తిగా నిర్వీర్యమైంది. బీడీ కార్మిక పిల్లల చదువులకు కేంద్రకార్మిక సంక్షేమ శాఖ ఉపకార వేతనాలను అందించే పథకం ఇప్పుడు పూర్తిగా తీసేశారు. దేశం మొత్తంలో కార్మికుల పిల్లలతోపాటు బీడీ కార్మికుల పిల్లలకు 6వ తరగతి నుంచి ఉన్నత విద్యకు ఉపకార వేతనాలను అందించేది. ఆపథకం కూడా కార్మికుల పిల్లలకు అందని ద్రాక్షగా మారింది.





అందని వైద్యం

బీడీ కార్మికుల కోసం మెదక్ పార్లమెంటు పరిధిలోని దుబ్బాక, సిద్దిపేట, మెదక్‌తోపాటు, మిగితా కార్మికుల కోసం సంగారెడ్డి, పటన్‌చెరువు ప్రాంతాల్లో డిస్పెన్సరీ ఆసుపత్రులను 1983లో ఏర్పాటు చేశారు. రెండు దశాబ్దాలుగా ఆ ఆసుపత్రులకు కనీస సౌకర్యాలను కల్పించలేదు. సమీప గ్రామాలకు వెళ్లి సంచార వైద్యంను కొనసాగించాల్సిన డిస్పెన్సరీ ఆసుపత్రులకు తగిన ప్రోత్సాహం లభించకపోవడంతో అవస్థలు తప్పడంలేదు. బీడీలు చుట్టడం వల్ల టీబీ, క్యాన్సర్ లాంటి వ్యాధులకు చికిత్స అందించాల్సిన కేంద్ర కార్మిక సంక్షేమ శాఖ ఆసుపత్రులను గాలికి వదిలేసింది.



బీడీలు చుడుతున్న మహిళా కార్మికులు (ఫైల్)

సిద్దిపేటకు కలగానే ఈఎస్‌ఐ ఆసుపత్రి

జిల్లాలో సుమారు 75వేల మంది కార్మికులు, వారి కుటుంబాలు ఉండగా తమకు మెరుగైన వైద్యం కోసం సిద్దిపేటలో ఈఎస్‌ఐ ఆస్పత్రి కావాలని సుమారు రెండు దశాబ్దాల నుంచి డిమాండ్ చేస్తున్నారు. పీఎఫ్, ఉద్యోగవిరమణ పొందిన కార్మికులు సుమారు లక్షా 20 వేల మంది ఉంటారు. వీరంతా మెరుగైన వైద్యసేవలకు హైదరాబాద్‌కు వెళ్లాల్సి వస్తుంది. అక్కడ కూడా రద్దీగా ఉండటంతో సిద్దిపేటలో ఉమ్మడి మెదక్ జిల్లా, సరిహద్దు జిల్లాల కార్మికుల కోసం ఈఎస్‌ఐ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. కనీసం ఈఎస్‌ఐ కార్యాలయంనైనా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

పని దినాలు లేవు.. ప్రత్యామ్నాయం లేదు..

కేంద్ర ప్రభుత్వాలు బీడీ పరిశ్రమను సంక్షోభంలో నెట్టడం మూలంగా బీడీ యజమానులు సరైన పని దినాలు కల్పించడంలేదు. నెలసరిగా కేవలం 10 రోజులే పనిదినాలు ఇస్తుండటంతోపాటు, చేతి నిండా పని దేవుడెరుడు..? ఇచ్చిన పని దినాలకు ఆకు, తంబాకు కూడా కోత విధిస్తున్నారు. దీని మూలంగా బీడి కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 22 కంపెనీలు కొనసాగుతున్నాయి. సిద్దిపేట జిల్లాలోనే 16 కంపెనీలు ఉన్నాయి. అంతంతమాత్రంగా పని దినాలు ఉన్న కార్మికులకు గత రాష్ట్ర ప్రభుత్వం జీవన భృతి కల్పించింది. ఉమ్మడి జిల్లాలో 56వేల మందికి జీవన భృతి అందుతుంది. నాన్‌పీఎఫ్‌తోపాటు మరి కొంతమంది కార్మికులకు జీవనభృతి కూడా అందడంలేదు. అయితే జీవభృతి కుదించే అవకాశం ఉండటంతో బీడీ కార్మికులు తమకు జీవనోపాధికి ప్రత్యామ్నాయం కల్పించాలనే డిమాండ్ చేస్తున్నారు. గ్రామీణ పరిశ్రమలను బలోపేతం చేయడంతోపాటు బీడీ పరిశ్రమను నమ్ముకున్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిపెట్టి, జీవనోపాధి మార్గాలను పెంచాలని కోరుతున్నారు.

పోలింగ్ కేంద్రాల వద్ద ఇబ్బందులు రానివ్వొద్దు



జహీరాబాద్‌లో మాట్లాడుతున్న ఆర్డీవో రాజు

జహీరాబాద్, మే 8: పోలింగ్‌కేంద్రాల వద్ద వసతుల కొరత లేకుండా ఆయా కేంద్రాలకు కేటాయించిన ఎన్నికల సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని జహీరాబాద్ ఆర్డీవో రాజు పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో పోలింగ్ కేంద్రాలకు కేటాయించిన వెల్ఫేర్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ పోలింగ్ కేంద్రం వద్ద టెంట్, మంచినీటి సౌకర్యం, వీల్‌ఛైర్, తదితర వసతులు కల్పించాలన్నారు.

'ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి'

నారాయణఖేడ్, మే 8: ఖేడ్ మండలం గునుకుల కుంట, మాద్వార్ తండాల్లో కొత్తపోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసిన నేపథ్యంలో ఆయా గ్రామాల్లో గ్రామ సభలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో అశోక చక్రవర్తి మాట్లాడుతూ ఓటర్లంతా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరుతూ ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. తహసీల్దార్ భాస్కర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

'ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి'

మునిపల్లి, మే 8: ఉపాధిహామీ పథకంలో భాగంగా కూలీల సంఖ్య పెంచి, వారికి పనులతో పాటు సౌకర్యాలు కల్పించాలని పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందిని ఎంపీడీవో హరినందన్‌రావు ఆదేశించారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందికి సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఏపీవో యాదగిరి, ఇన్‌చార్జి ఎంపీవో నాగలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

నార్సింగి మండలంలో 'ఉపాధి' పనులపై ఆడిట్

చేగుంట, మే 8: నార్సింగి మండల పరిషత్ కార్యాలయంలో 2023-24 సంవత్సరానికి సంబంధించి ఉపాధిహామీ పనులకు డీఆర్డీఏ ఏపీడీ విరోజ ఆధ్వర్యంలో బుధవారం అధికారులచే ఆడిట్ నిర్వహించగా కొన్ని పొరపాట్లు చోటు చేసుకున్నట్లు తెలిపారు. మండలంలోని తొమ్మిది గ్రామాల్లో ఉపాధిహామీ కింద జరిగిన వివిధ రకాల పనులకు సంబంధించిన రూ.37,250 రికవరీ చేయగా, రూ.38వేల జరిమానా విధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ విజిలెన్స్ అధికారి శ్రీహరిగౌడ్, అంబుడ్స్‌మెన్ శిరిగే ప్రభాకర్, ఎంపీడీవో చిన్నారెడ్డి, ఎంపీవో నరేష్, ఇన్‌చార్జి ఏపీవో రాజేశ్వర్ గౌడ్, టీఏ స్వామి, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

'వర్మి కంపోస్ట్‌ను వెంటనే తరలించండి'

మెదక్ మున్సిపాలిటీ, మే 8: పట్టణంలో సేకరించిన చెత్తను బయోమైనింగ్ చేయడం వల్ల వచ్చిన వర్మికంపోస్టును వెంటనే డంపింగ్‌యార్డు నుండి తరలించాలని వరంగల్ ఆర్‌డీఎంఏ షాహెద్‌మసూద్ ఆదేశించారు. వరంగల్ పబ్లిక్‌హెల్త్ శ్రీనివాస్‌రావ్‌తో కలిసి బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయానికి చేరుకుని, డంపింగ్‌యార్డును పరిశీలించారు. కార్యాలయంలో ఆయా విభాగాల సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. వెంట కమిషనర్ జానకిరాంసాగర్, సిబ్బంది ఉన్నారు.

ఐఎంఎల్ డిపోను సందర్శించిన ఎలక్షన్ అబ్జర్వర్

కొల్చారం, మే 8: మెదక్, సంగారెడ్డి జిల్లాల్లోని వైన్స్‌లకు లిక్కర్ సరఫరా చేసే ఇండియన్ మేడ్ లిక్కర్ డిపోను బుధవారం ఎలక్షన్ ఎక్స్‌పెండిచర్ అబ్జర్వర్ సునీల్‌కుమార్ సందర్శించారు. డిపోలోని గోదాంను పరిశీలించిన ఆయన జనవరి నుంచి ఇప్పటివరకు జరిగిన లిక్కర్ విక్రయాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వెంట ఎక్సైజ్ సీఐ నాగేశ్వర్‌రావు, ఎక్సైజ్ సీఐ రామిరెడ్డి, ఎన్‌ఫోర్స్‌మెంటు సీఐ నరేందర్ ఉన్నారు.

పరిశ్రమలో కార్మికుడి మృతి

● మృతదేహంతో గ్రామస్థుల ఆందోళన



సత్యనారాయణ (ఫైల్)

హత్నూర, మే 8: మండలంలోని నస్తీపూర్ గ్రామ శివారులోని లోటస్ చాక్లెట్ పరిశ్రమలో విధులు నిర్వహిస్తున్న ఓ కార్మికుడు పని చేస్తూనే ఒక్కసారి కుప్పకూలి చనిపోయాడు. అయితే, పరిశ్రమ నిర్వాహకుల నిర్లక్ష్యం వల్లే కార్మికుడు చనిపోయాడని గ్రామస్థులు ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెళ్లితే.. మంగాపూర్ గ్రామానికి చెందిన నక్కసించు సత్యనారాయణ (42) 18 ఏళ్లుగా అదే పరిశ్రమలో ఫిట్టర్‌గా పని చేస్తున్నాడు. రోజువారీగానే బుధవారం 9గంటలకు పరిశ్రమలో విధుల్లో చేరాడు. అక్కడ విధులు నిర్వహిస్తున్న క్రమంలో ఒక్కసారిగా కుప్పకూలాడు. వెంటనే అప్రమత్తమైన పరిశ్రమ ప్రతినిధులు చికిత్స నిమిత్తం సంగారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరిశీలించిన డాక్టర్లు అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. ఈ సమాచారమందుకున్న కుటుంబీకులు, గ్రామస్థులు పరిశ్రమ వద్దకు చేరుకొని ఆందోళనకు దిగారు. యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే సత్యనారాయణ మృతి చెందాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. మృతుడి కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని మృతదేహాన్ని పరిశ్రమ ఎదుట ఉంచి ఆందోళనకు దిగారు. యాజమాన్యం ఎంతకూ దిగి రాకపోవడంతో సంగారెడ్డి-నర్సాపూర్ ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేశారు. పోలీసులు పలు విధాలు నచ్చజెప్పినా వినలేదు. సాయంత్రం మరోసారి గ్రామస్థులు, స్థానిక నాయకులు పరిశ్రమ యాజమాన్యంతో సంప్రదించగా.. రూ. 8లక్షల పరిహారంతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కేసు దర్యాప్తు చేపట్టామని ఎస్‌ఐ సుభాష్ తెలిపారు.

బీజేపీ ప్రభుత్వంతోనే దేశ రక్షణ: చీకోటి ప్రవీణ్

హత్నూర, మే 8: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వంతోనే దేశ రక్షణ సాధ్యమని బీజేపీ రాష్ట్ర నాయకుడు చీకోటి ప్రవీణ్ అన్నారు. బుధవారం రాత్రి హత్నూర మండలం దౌల్తాబాద్‌లో బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావుకు మద్దతుగా రోడ్ షో, కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా చీకోటి ప్రవీణ్ మాట్లాడుతూ దేశాన్ని దోచుకొని ఇతర దేశాలకు తాకట్టు పెట్టిన కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో రాష్ట్రం దివాలా తీసిందన్నారు. దేశం అభివృద్ధి చెందాలంటే మోదీ శ్రీరామరక్ష అన్నారు.మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావును భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కమిటీ సభ్యుడు మురళీధర్‌యాదవ్, రఘువీరారెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బిట్ల మహేష్, మండల అధ్యక్షుడు నాగప్రభుగౌడ్, నాయకులు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురికి గాయాలు



డివైడర్‌ను ఢీకొని ధ్వంసమైన కారు

తూప్రాన్, మే 8: మండలంలో బుధవారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురు గాయపడ్డారు. హైదరాబాద్ నుంచి నిజామాబాద్ వైపు వెళ్తున్న కారు తూప్రాన్ పరిధిలోని అల్లాపూర్ శివారులో టోల్‌ప్లాజా వద్ద రోడ్డుపక్క డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో నిజామాబాద్‌కు చెందిన వెంకటసాయి(23), భీంగల్‌కు చెందిన అఖిలేష్(20), సికింద్రాబాద్‌కు చెందిన ప్రియాంక(22) తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స కోసం హైదరాబాద్ ఆస్పత్రికి తరలించారు. మరో ఘటనలో.. కామారెడ్డికి చెందిన అక్షయ్, వనపర్తికి చెందిన మణికంఠ ద్విచక్ర వాహనంపై వెళ్తున్న క్రమంలో తూప్రాన్ వద్ద అదుపుతప్పి కింద పడటంతో వారికి గాయాలయ్యాయి. తూప్రాన్ టోల్‌ప్లాజా వద్ద ముందు వెళ్తున్న కంటైనర్ లారీ సడన్ బ్రేక్ వేయడంతో వెనుక వస్తున్న రెండు కార్లకు సైతం బ్రేక్ వేసి ఆపేశారు. అయితే వాటి వెనుక నుంచి వచ్చిన మరో కంటైనర్ ఆగిన కార్లను ఢీకొట్టడంతో రెండుకార్లు దెబ్బతిన్నాయి. ఈ సంఘటనలో ఓ మహిళ స్వల్పగాయాలతో బయటపడింది. తూప్రాన్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

మద్యం అక్రమ అమ్మకాలపై టాస్క్‌ఫోర్స్ దాడులు

సంగారెడ్డి క్రైం, మే 8: జహీరాబాద్, జిన్నారం మండలాల్లో బుధవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు విస్తృత దాడులు నిర్వహించి, అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. జిన్నారం మండలం గడ్డపోతారం, బొల్లారం, చెట్లపోతారం గ్రామాలతో పాటు జహీరాబాద్ మండలం రంజోల్‌లో అక్రమంగా నిల్వ ఉంచి విక్రయిస్తున్న 80.800 లీటర్ల మద్యంను స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించి నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నామని జిల్లా ఎస్పీ రూపేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఎవరైనా మద్యం విక్రయాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

మెదక్‌లో బీజేపీ, కాంగ్రెస్ మ్యాచ్ ఫిక్సింగ్

● సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



సంగారెడ్డి రూరల్, మే 8: మెదక్ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపిని గెలిపించేందుకు కాంగ్రెస్ పార్టీ మ్యాచ్‌ఫిక్సింగ్ చేసుకున్నదని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ గురువారం ఒక ప్రకటనలో ఆరోపించారు. బైండోవర్ల పేరిట బీఆర్ఎస్ కార్యకర్తలపై వేధింపులు ఆపాలని, లేని పక్షంలో న్యాయ పోరాటాలు తప్పవని హెచ్చరించారు. రాష్ట్రంలో బలమైన ప్రాంతీయ పార్టీ బీఆర్ఎస్‌ను దెబ్బతీసేందుకు కాంగ్రెస్, బీజేపీలు రహస్య ఒప్పందం చేసుకున్నాయని విమర్శించారు. బీఆర్ఎస్ నుంచి మైనార్టీలను దూరం చేసి పరోక్షంగా బీజేపీని గెలిపించాలని చూస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చింతా ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. కాగా పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ నెల 9న సాయంత్రం 5 గంటలకు సంగారెడ్డిలో మాజీ మంత్రి హరీశ్‌రావు రోడ్‌షో నిర్వహించనున్నారని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ తెలిపారు. రోడ్‌షోను విజయవంతం చేయాలని కోరారు.

మంత్రి దామోదర్ సమక్షంలో పలువురి చేరిక

పుల్‌కల్/వట్‌పల్లి/టేక్మాల్/రేగోడ్ మే 8: సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోని పలు మండలాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు బుధవారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఉమ్మడి పుల్కల్ మండలం మంతూరు గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యురాలు సీ.పావని భర్త వేణుగోపాల్ యాభై మంది అనుచరులతో సంగారెడ్డిలోని మంత్రి దామోదర్ నివాసానికి తరలివెళ్లి కాంగ్రెస్ కండువాలు కప్పుకున్నారు. వట్‌పలి మండల పరిధిలోని మరవెల్లిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయా గ్రామాల్లోని బీఆర్ఎస్ నాయకులు మంత్రి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. టేక్మాల్ మండలానికి చెందిన సుమారు 200 మంది నాయకులు మెదక్ జిల్లా కో ఆప్షన్ సభ్యుడు యూసుఫ్‌తో పాటు సొసైటీ డైరెక్టర్ సత్యం, రైతుబంధు అధ్యక్షుడు సూర్య రాజయ్య తదితరులు ఆధ్వర్యంలో మంత్రి సమక్షంలో కాంగ్రెస్‌లో పార్టీలో చేరారు. రేగోడు మండలంలోని చౌదరిపల్లి, టి లింగంపల్లి, సింధోల్, కొండాపూర్, వెంకటాపూర్ గ్రామాల చెందిన పలువురు నాయకులు మంత్రి దామోదర్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరినట్టు మండల అధ్యక్షుడు దిగంబర్‌రావ్ తెలిపారు.



వెంకట్రామారెడ్డికి మద్దతుగా గజ్వేల్ పట్టణంలో ప్రచారం చేస్తున్న మునిసిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి



ములుగు మండలం నర్సంపల్లిలో వెంకట్రామారెడ్డి తరఫున ప్రచారం చేస్తున్న మండలాధ్యక్షురాలు అక్షితరెడ్డి



మర్కుక్ మండలంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న జడ్పీటీసీ మంగమ్మ రామచంద్రం

కేసీఆర్‌కు పూర్తిస్థాయిలో అండగా ఉందాం



జగదేవ్‌పూర్: బీఆర్ఎస్ గెలుపు కోసం దౌలాపూర్‌లో అమ్మవారికి ముడుపు కడుతున్న నాయకులు

- గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి
- వెంకట్రామారెడ్డికి మద్దతుగా నాయకుల ప్రచారం

గజ్వేల్, మే 8: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కేసీఆర్‌కు పూర్తిస్థాయిలో అండగా ఉందామని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి ప్రజలను కోరారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని ఆయా వార్డుల్లో ఆయన బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయనవెంట వైస్ చైర్మన్ జకీయోద్దీన్ ఉన్నారు. అలాగే గజ్వేల్ మండల పరిధిలోని పిడిచెడ్ గ్రామంలో జడ్పీటీసీ పంగ మల్లేశం ప్రచారం నిర్వహించారు.

కాంగ్రెస్, బీజేపీ మాటలు నమ్మి మోసపోవద్దు

ములుగు, మే 8: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ మాటలు నమ్మి మోసపోవద్దని బీఆర్ఎస్ మండలాధ్యక్షురాలు అక్షితరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ములుగు మండలం నర్సంపల్లి గ్రామంలో మహిళలతో కలిసి ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

వెంకట్రామారెడ్డిని ఎంపీగా గెలిపించాలి

మర్కుక్, మే 8: కాంగ్రెస్, బీజేపీ మాటలు నమ్మి మోసపోకుండా ప్రజలు వెంకట్రామారెడ్డికి ఓటేసి గెలిపించాలని మర్కుక్ జడ్పీటీసీ మంగమ్మరామచంద్రం, వైస్ ఎంపీపీ మంద బాల్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కాశిరెడ్డిపల్లిలో ఇంటింటి ప్రచారం నిర్వహించి, ఉపాధిహామీ కూలీలను కలిసి కారు గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కృష్ణయాదవ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఐదు హామీల బాధ్యత మా కుటుంబానిదే: భరత్‌రెడ్డి

కుకునూరుపల్లి, మే 8: వెంకట్రామారెడ్డి ఇచ్చిన ఐదు హామీల బాధ్యత మా కుటుంబానిదేనని ఆయన కుమారుడు భరత్‌రెడ్డి తెలిపారు. బుధవారం రాత్రి కుకునూరుపల్లి మండలం మాత్‌పల్లి గ్రామంలో ఇంటింట ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దేవి రవీందర్, నర్రా జైపాల్‌రెడ్డి, సద్గుణ రవీందర్, కోలా శ్రీను, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ గెలుపు ఖాయం

మిరుదొడ్డి, మే 8: బీఆర్ఎస్ మెదక్ అభ్యర్థి వెంకట్రామారెడ్డి గెలుపు ఖాయమని సర్పంచుల ఫోరం మాజీ మండలాధ్యక్షుడు తుమ్మల బాల్‌రాజు అన్నారు. బుధవారం మిరుదొడ్డి మండలం కాసులాబాద్ గ్రామంలో ఉపాధి హామీ కూలీల వద్దకెళ్లి వెంకట్రామారెడ్డికి ఓటేసి గెలిపించాలని కోరారు.

అమ్మవారికి ముడుపు

జగదేవ్‌పూర్, మే 8: బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డి లక్ష మెజారిటీతో విజయం సాధించాలని కోరుతూ బుధవారం మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రాచమల్ల ఉపేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో జగదేవ్‌పూర్ మండలం దౌలాపూర్ గ్రామంలోని దుర్గామాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, ముడుపు కట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు జూపల్లి మధు, యూత్ అధ్యక్షుడు జూపల్లి బంగారి పాల్గొన్నారు. అలాగే జగదేవ్‌పూర్ మండలంలోని వివిధ గ్రామాల్లో నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ రంగారెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

●**గుమ్మడిదల:** గుమ్మడిదల మండలం దోమడుగు గ్రామంలో బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామారెడ్డికి మద్దతుగా ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. అలాగే గుమ్మడిదల గ్రామంలో కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు అభిమానులు జడ్పీటీసీ కుమార్‌గౌడ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గోవర్ధన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు.



కుకునూరుపల్లిలో ఇంటింటి ప్రచారం చేస్తున్న వెంకట్రామారెడ్డి కుమారుడు భరత్‌రెడ్డి



మిరుదొడ్డి మండలం కాసులాబద్ గ్రామంలో ఉపాధిహామీ కూలీలను ఓటు అభ్యర్థిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



పట్టణంలోని సిద్ది-ఇన్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ సుకుమార్

అదానీ, అంబానీలకు బీజేపీ చేయూత

- బీజేపీకి ఓటేస్తే సంక్షోభంలో పడనున్న రాజ్యాంగం
- జోడోయాత్ర సభ్యుడు, ప్రొఫెసర్ సుకుమార్

జహీరాబాద్, మే 8: కేంద్రంలో అధికారంలో కొనసాగుతున్న బీజేపీ ప్రభుత్వం దేశ సంపదను పెట్టుబడిదారులైన అదానీ, అంబానీలకు దోచి పెట్టి చేయూతనిచ్చిందని జోడోయాత్ర సభ్యుడు, ప్రొఫెసర్ సుకుమార్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని సిద్ది-ఇన్‌లో పలువురు మేధావివర్గాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడే మోదీ ప్రభుత్వాన్ని గద్దెదించాల్సిన అవసరం ఉన్నదన్నారు. గడిచిన పదేళ్ల కాలంగా నరేంద్రమోదీ దేశానికి పెద్దగా ఒరగబెట్టిందేమీ లేదన్నారు. 400 సీట్లు సాధించి రాజ్యాంగాన్ని మారుస్తామని, మైనార్టీల రిజర్వేషన్లు తొలగిస్తామని, ఇలా రాజ్యాంగాన్ని సంక్షోభంలోకి నెట్టేందుకు చేస్తున్న ప్రయత్నాన్ని అందరం ఓటు అనే ఆయుధంతో తిప్పికొట్టాలని చెప్పారు. సమాజంలో అందరిని సంఘటితం చేస్తు చైతన్య పరిచేందుకుగాను తాము కార్యక్రమాలను చేపడుతున్నామని ఆయన వివరించారు. రాజ్యాంగం సంక్షోభంలో పడకముందే అందరం ఆలోచించి కాంగ్రెస్ అభ్యర్థి సురేష్‌కుమార్ షెట్కార్‌కు ఓటేసి గెలిపించాలన్నారు. అనంతరం న్యాయవాది రమణారెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు జనార్ధన్, రాజుషెట్కార్, తుక్కారెడ్డి, మేధావులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని యువకుడి మృతి

- ఇయర్‌ఫోన్ పెట్టుకుని బైక్‌పై ట్రాక్ దాటుతుండగా ఘటన
- భయంతో పారిపోయిన మరో యువకుడు



ప్రకాశ్(ఫైల్)

రామాయంపేట, మే 8: చెవిలో ఇయర్‌ఫోన్ పెట్టుకుని బైక్‌ను పట్టాలు దాటిస్తుండగా రైలు ఢీకొని ఓ యువకుడు అక్కడికక్కడే మృచెందాడు. ఈ సంఘటన మెదక్ జిల్లా రామాయంపేట మండలం అక్కన్నపేట సమీపంలో జరిగింది. కామారెడ్డి జిల్లా రాజంపేట మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన ప్రకాశ్(25), మరో స్నేహితుడితో కలిసి రామాయంపేటకు వచ్చాడు. ప్రకాశ్ చెవిలో ఇయర్ ఫోన్స్ పెట్టుకుని రైలు వస్తున్న విషయాన్ని గమనించకుండా బైక్‌ను పట్టాలు దాటే ప్రయత్నం చేస్తున్నాడు. ఇంతలో వేగంగా వచ్చిన రైలు ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. బైక్ వెనక సీటులో కూర్చున్న యువకుడు భయంతో పారిపోయాడు. కామారెడ్డి రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



గజ్వేల్ పట్టణంలో మాట్లాడుతున్న విశ్రాంత ఐఏఎస్ ఆకునూరి మురళి

నాయకులు జేబుదొంగలు, బందిపోట్లుగా మారారు

- పదేళ్లలో బీజేపీ తెలంగాణకు చేసిందేమీ లేదు
- పాకిస్థాన్‌ను బూచీగా చూపించి ఓట్లు దండుకునే కుట్రలకు మోదీ పన్నాగం
- రాజకీయాల కోసం బస్సు యాత్ర చేపట్టలేదు
- జాగో తెలంగాణ కన్వీనర్, విశ్రాంత ఐఏఎస్ ఆకునూరి మురళి

గజ్వేల్/నర్సాపూర్/ మే 8: దేశంలో రాజకీయ నాయకులు జేబుదొంగలు, బందిపోట్లుగా మారారని జాగో తెలంగాణ కన్వీనర్, విశ్రాంత ఐఏఎస్ ఆకునూరి మురళి విమర్శించారు. జాగో తెలంగాణ, టీడీఎస్ఎఫ్ అధ్వర్యంలో సాగుతున్న ఓటర్ల చైతన్య బస్సు యాత్ర బుధవారం 8వ రోజు గజ్వేల్ ఇందిరాపార్క్ చౌరస్తాకు చేరుకున్నది. అలాగే, మెదక్ జిల్లా నర్సాపూర్‌లో, సంగారెడ్డి జిల్లా కంది మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అంటే కేవలం రాష్ట్ర ప్రభుత్వమే కనిపిస్తున్నదని, కేంద్ర ప్రభుత్వం ఎవరికి కనిపించదని ఆకునూరి మురళి పేర్కొన్నారు. గత పదేళ్లలో కేంద్రంలో అధికారంలో బీజేపీ తెలంగాణకు చేసిందేమీ లేదన్నారు. కేవలం పాకిస్థాన్‌ను బూచీగా చూపించి ఓట్లు దండుకునే కుట్రలకు మోదీ పన్నాగం పన్నాడని మండిపడ్డారు. 2024 వరకు ప్రతి నిరుపేదకు ఇళ్లు కట్టిస్తానని చెప్పారని, ఇప్పటివరకు ఎన్ని ఇళ్లు కట్టారో చెప్పాలన్నారు. తెలంగాణకు వచ్చిన ప్రతిసారి ప్రతిపక్షాలను విమర్శించడం తప్ప తాను ఏం చేశాడో ఇప్పటివరకు చెప్పలేదన్నారు. భారత రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలో పడేసిన మోదీని ఓడించాలని, ప్రజా సంక్షేమాన్ని, సుస్థిర అభివృద్ధిని గాలికి వదిలి అధికారం కోసం విద్వేషాలు రెచ్చగొడుతూ, సమాజాన్ని విచ్ఛిన్నం చేసే ప్రయత్నాలు చేస్తున్న మోదీని గద్దె దింపాలన్నారు. రాజ్యాంగాన్ని మారుస్తామని, రిజర్వేషన్లను ఎత్తివేస్తామని పదే పదే ప్రకటిస్తున్న మోదీకి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ప్రజాస్వామ్యానికి ప్రమాదకరంగా మారి దేవుళ్ల పేరుతో ఓట్లను అడగటం సిగ్గు చేటన్నారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలను ఇస్తానని, నల్లధనాన్ని స్వాధీనం చేసుకొని పెదలకు పంచుతానన్న మోదీ హామీని మరిచారని పేర్కొన్నారు. రాజకీయాల కోసం బస్సు యాత్ర చేపట్టలేదని, ప్రజలను చైతన్యం చేయడానికే యాత్ర చేపట్టినట్లు తెలిపారు. నాణ్యమైన విద్య, ఆరోగ్యం, ఉపాధి, వ్యవసాయానికి ప్రభుత్వాలు ప్రాధాన్యత ఇవ్వాలని, ఇతర దేశాల మాదిరిగా రెండుసార్లకు మించి ప్రధాని పదవిని ఇవ్వొద్దన్నారు. ఐఏఎస్, ఐపీఎస్‌లు లంచాలు తిని రాజకీయాల్లోకి వస్తున్నారని మండిపడ్డారు. ఈ బస్సు యాత్రలో ప్రొఫెసర్లు కె.లక్ష్మీనారాయణ, పద్మజాషా, జానయ్య, డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన, జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు, యూత్ లీడర్ పులి నవీన్‌కుమార్, గోవర్ధన్‌రాయ్, రాంచందర్, శ్రీకాంత్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



పెద్దశంకరంపేటలో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న కోణం విఠల్, బీజేపీ నాయకులు

బీబీపాటిల్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలి

- బీజేపీ మండలాధ్యక్షుడు కోణం విఠల్

పెద్దశంకరంపేట, మే 8: బీజేపీ జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థి బీబీపాటిల్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని బీజేపీ మండలాధ్యక్షుడు కోణం విఠల్ పేర్కొన్నారు. బుధవారం పెద్దశంకరంపేట పట్టణంతోపాటు మండల పరిధిలోని చీలపల్లి, కమలాపూర్, కొత్తపేట్, లక్ష్మాపూర్, టెంకటి, తదితర గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల నాయకులు, మాజీ సర్పంచులు సూర్యప్రకాష్, అశోక్, సుభాష్, శ్రావణ్, కృష్ణ, సంగమేశ్వర్ పాల్గొన్నారు.

వాహనాల తనిఖీలో రూ.77 వేల నగదు పట్టివేత

చేర్యాల, మే 8: చేర్యాల పోలీసుల ఆధ్వర్యంలో పట్టణంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో బుధవారం రాత్రి చేపట్టిన వాహన తనిఖీలో గజ్వేల్‌కు చెందిన రమణగిరి వెంకటేశ్ వద్ద రూ.77 వేలు నగదు పట్టుకున్నారు. డబ్బులకు సంబంధించి ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో సీజ్ చేసినట్లు ఎస్ఐ దామోదర్ తెలిపారు.

కామారెడ్డిలో చెల్లని రూపాయి కేసీఆర్

- తెలంగాణలో 17 సీట్లు ఎలా గెలిపిస్తారు
- రాష్ట్ర రాజకీయాలను దిగజార్చింది ఆయనే
- నేను గెలవగానే ఊచలు లెక్కబెట్టిస్తా
- బీజేపీ మెదక్ అభ్యర్థి రఘునందన్‌రావు

సిద్దిపేట, ఆంధ్రజ్యోతి, మే 8: దుబ్బాకలో చెల్లని రూపాయి మెదక్‌లో చెల్లుతుందా అని మాజీ సీఎం కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ మెదక్ అభ్యర్థి రఘునందన్‌రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బుధవారం ఆయన సిద్దిపేటలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. కామారెడ్డిలో ఓడిపోయిన కేసీఆర్ ఈ రాష్ట్రంలోని 17 ఎంపీ సీట్లను ఎలా గెలిపిస్తారని ప్రశ్నించారు. తాను మెదక్‌లో ఓట్లు అడుగుతుంటే ఓర్వలేని కేసీఆర్.. తెలంగాణ అంతటా ఎందుకు తిరుగుతున్నారని ప్రశ్నించారు. 'తెలంగాణ నీ అయ్య జాగీరా' అంటూ ధ్వజమెత్తారు. ఆయన సీఎంగా ఉన్నప్పుడే దుబ్బాకలో గెలిచి చూపించానని గుర్తుచేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో పోలీసులతో డబ్బులు పంచిపెట్టి దుబ్బాకలో గెలిచారని, ఇది తప్పయితే సిద్దిపేట వెంకటేశ్వర స్వామి గుడిలో ప్రమాణం చేద్దామని సవాల్ విసిరారు. పోలీస్ అధికారి రాధాకిషన్‌రావు ఈ విషయాన్ని స్వయంగా ఒప్పుకున్నారని చెప్పారు. మాలాంటి ఉద్యమకారులను తరిమికొట్టి కూతురు, కొడుకు, అల్లుడికి పదవులు కట్టబెట్టారని ఆరోపించారు. తాను గెలవగానే శ్రీకృష్ణ జన్మస్థానంలో వీరందరినీ ఊచలు లెక్కబెట్టిస్తానని హెచ్చరించారు. తెలంగాణలో రాజకీయాలను దిగజార్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని ఎద్దేవా చేశారు. తనను ఒకటంటే తాను నాలుగు అంటానని, మరోసారి తన జోలికి రావొద్దని రఘునందన్ సూచించారు.



వర్గల్ అంబేడ్కర్ చౌరస్తాలో ప్రచార రథంపై నుంచి మాట్లాడుతున్న రఘునందన్‌రావు

నరేంద్రమోదీ నాయకత్వంలోనే దేశం సుభిక్షం

వర్గల్, మే 8: దేశ ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలోనే దేశం సుభిక్షంగా ఉన్నదని బీజేపీ మెదక్ అభ్యర్థి రఘునందన్‌రావు అన్నారు. బుధవారం వర్గల్ మండల కేంద్రంలో రోడ్ షో నిర్వహించగా పార్టీ మండల శ్రేణులు బోనాలు, గజమాలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రఘునందన్‌రావు మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం మోదీ అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి నందన్‌గౌడ్, పార్టీ మండలాధ్యక్షుడు టేకులపల్లి బాల్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాంరెడ్డి పాల్గొన్నారు.



సిద్దిపేటలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ మెదక్ అభ్యర్థి రఘునందన్‌రావు

కేసీఆర్ చెప్పినవన్నీ అబద్ధాలే

మెదక్ అర్బన్, మే 8: మాజీ సీఎం కేసీఆర్ బస్సుయాత్రలో చెప్పినవన్నీ పచ్చి అబద్ధాలేనని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బార్ అసోసియేషన్ మెదక్ అధ్యక్షుడు సుభాష్ గౌడ్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కాశీనాథ్ పాల్గొన్నారు.

●**గజ్వేల్:** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని 10వ వార్డులో బీజేపీ ఎంపీ అభ్యర్థి మాధవనేని రఘునందన్‌రావుకు మద్దతుగా బీజేపీ పట్టణ అధ్యక్షుడు మనోహర్ యాదవ్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయనవెంట బీజేపీ పట్టణ కార్యదర్శి సందీప్ ఉన్నారు.

కాంగ్రెస్‌కు పెరుగుతున్న ఆదరణ

- కాంగ్రెస్ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి సురేష్‌షెట్కార్

నారాయణఖేడ్, మే 8: కాంగ్రెస్ పట్ల ప్రజల్లో రోజురోజుకూ ఆదరణ పెరుగుతున్నదని బీఆర్ఎస్ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి సురేష్‌షెట్కార్ అన్నారు. బుధవారం ఖేడ్‌లోని ఆయన నివాసంలో ఉమ్మడి మెదక్ జిల్లా జడ్పీ ప్రణాళిక సంఘం మాజీ సభ్యుడు నగేష్‌షెట్కార్ సమక్షంలో ఖేడ్ పట్టణానికి చెందిన దర్గా మజీద్ కమిటీ అధ్యక్షుడు హషంఅలీ, నాయకులు లతీఫ్‌సేట్, సలీం, అమేర్‌తో పాటు వెంకటాపూర్, రాంతీర్థ్, నాగూర్.బి, పుల్‌కుర్తి, తడ్కల్ గ్రామాలకు చెందిన దాదాపు 150 మంది నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా షెట్కార్ మాట్లాడుతూ పదేళ్ల బీజేపీ హయాంలో పెరిగిన ధరలు, ప్రభుత్వ రంగసంస్థల ప్రైవేటు పరం, నల్ల చట్టాలు, హామీల విస్మరణతో ప్రజలు విసుగు చెందారన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు చేపట్టిందేనని టీపీసీసీ సభ్యుడు శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఖేడ్ మండలం పంచగామ, రుద్రారం గ్రామాల్లో ఉపాధిహామీ కూలీలతో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు.

సంక్షేమం, అభివృద్ధి కాంగ్రెస్‌తోనే: ఎమ్మెల్యే

నారాయణఖేడ్, మే 8: సంక్షేమం, అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రమైన నిజాంపేటలో కాంగ్రెస్ అభ్యర్థి సురేష్‌షెట్కార్‌కు మద్దతుగా నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. తమ పార్టీ శాసన సభ ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో ఐదింటిని అమలు చేస్తున్నదన్నారు. సీఎం రేవంత్ రైతులకు ఇచ్చిన హామీమేరకు రూ.2 లక్షల రుణమాఫీ పంద్రాగస్టు తర్వాత అమలు చేస్తామని తెలిపారని ఆయన గుర్తుచేశారు. ఈ సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జి శశికళయాదవరెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాకేష్ షెట్కార్ పాల్గొన్నారు.



ఖేడ్‌లో ఎంపీ అభ్యర్థి సురేష్‌షెట్కార్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

కాంగ్రెస్‌తోనే ప్రజలు ఆశించిన తరహాలో అభివృద్ధి

జహీరాబాద్, మే 8: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమవుతుందని రాష్ట్ర ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, మాజీ మంత్రి డా. చంద్రశేఖర్ పేర్కొన్నారు. బుధవారం రాత్రి జహీరాబాద్ పట్టణంలోని పలువార్డుల్లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన రోడ్‌షోలో ఆయన పాల్గొని మాట్లాడారు. గడిచిన పదేళ్లలో నరేంద్రమోదీ హయాంలో దేశానికి ఒరిగిందేమీ లేదన్నారు. అనంతరం ఎంపీ అభ్యర్థి సురేష్‌కుమార్‌షెట్కార్ మాట్లాడుతూ గతంలో తాను జహీరాబాద్ పార్లమెంట్ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశానని పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పనిచేసే కాంగ్రెస్‌కు ఓటేసి గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ టీఎస్ఐడీసీ చైర్మన్ మహ్మద్‌తన్వీర్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు ఉజ్వల్‌రెడ్డి, మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.



జహీరాబాద్‌లో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న మాజీ మంత్రి చంద్రశేఖర్, ఎంపీ అభ్యర్థి సురేష్‌కుమార్‌షెట్కార్

●**మునిపల్లి:** మండల పరిధిలోని మల్లికార్జున్‌పల్లి గ్రామంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వడ్ల మల్లికార్జున్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి సురేష్‌షెట్కార్‌కు మద్దతుగా బుధవారం ప్రచారం నిర్వహించారు.

●**పెద్దశంకరంపేట:** కాంగ్రెస్ అభ్యర్థి సురేష్‌షెట్కార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పెద్దశంకరంపేటతో పాటు ఆయా గ్రామాల్లో కాంగ్రెస్ మండల నాయకులు ఆర్ఎన్.సంతోష్‌కుమార్, లక్ష్మణ్, ప్రణయ్, భానుగౌడ్, వసీం, విఠల్‌రెడ్డి, సత్యనారాయణ, రమేష్ ప్రచారం నిర్వహించారు.

పదో తరగతిలో మార్కులు తక్కువొచ్చాయని విద్యార్థి ఆత్మహత్య

మెదక్ అర్బన్, మే 8: ఇటీవల విడుదలైన పది ఫలితాల్లో మార్కులు తక్కువ వచ్చాయని ఓ విద్యార్థి మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మెదక్ జిల్లా కేంద్రంలో బుధవారం చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెల్దుర్తి మండలం కలాన్‌శెట్టిపల్లి గ్రామానికి చెందిన మణికంఠ(15) పట్టణంలోని ఫతేనగర్‌లో ఉంటున్నాడు. పదో తరగతి ఫలితాల్లో మణికంఠకు 8.8 జీపీఏ గ్రేడ్ వచ్చింది. మార్కులు తక్కువగా వచ్చాయని మనస్తాపంతో ఉండగా.. తల్లిదండ్రులు ధైర్యం చెప్పారు. ఈ క్రమంలో మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో బెడ్‌రూంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తండ్రి భిక్షపతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ దిలీప్‌కుమార్ తెలిపారు.

ప్రజలంతా ఓటు హక్కును వినియోగించుకోవాలి

● గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి



గజ్వేల్ పట్టణంలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న దృశ్యం



బెజ్జంకి మండల కేంద్రంలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు, కేంద్ర బలగాలు



హుస్నాబాద్‌లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు, కేంద్ర బలగాలు



చిన్నకోడూరులో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు, కేంద్ర బలగాలు

గజ్వేల్, మే 8: ప్రశాంత వాతావరణంలో ప్రజలంతా ఓటు హక్కును వినియోగించుకోవాలని గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి కోరారు. గజ్వేల్ పట్టణంలో బుధవారం ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్, పారామిలటరీ బలగాలు, పోలీసు సిబ్బందితో కలసి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు ఏలాంటి ఇబ్బందులు లేకుండా ఎన్నికలు జరపుకునేందుకు అధికారులతో కలసి ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. భారత రాజ్యాంగ ప్రజలకు ఇచ్చిన ఓటు హక్కును సద్వినియోగం చేసుకుని, పోలింగ్ శాతాన్ని పెంచేందుకు కృషిచేయాలని సూచించారు. సోషల్ మీడియాలో వచ్చే పుకార్లను నమ్మవద్దని, శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులకు ప్రజలు సహకరించాలని తెలిపారు. ఆయనవెంట గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ బి.సైదా, అదనపు సీఐ ముత్యంరాజు, ఎస్ఐలు శంకర్, యాదగిరి రెడ్డి తదితరులున్నారు.

చిన్నకోడూరులో..

చిన్నకోడూరు, మే 8 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బుధవారం సాయంత్రం చిన్నకోడూరు మండల కేంద్రంలో పోలీసులు కేంద్ర బలగాలతో కలిసి ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్దిపేట ఏసీపీ మధు మాట్లాడుతూ.. ఓటు వజ్రాయుధమని, ఈ నెల 13న జరిగే ఎన్నికలలో ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగంచేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను, చిన్నకోడూరు ఎస్ఐ బాలకృష్ణ, రాజగోపాల్‌పేట ఎస్ఐ భాస్కర్ రెడ్డి, సీఐఎస్ఎఫ్ బలగాలు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హుస్నాబాద్‌లో..

హుస్నాబాద్, మే 8: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా బుధవారం హుస్నాబాద్ పట్టణంలో కేంద్ర పోలీసు బలగాలు ఫాగ్‌మార్చ్ నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. నిర్భయంగా ఓటు వేసి ఓటింగ్ శాతాన్ని పెంచాలని పేర్కొన్నారు. ఇందులో హుస్నాబాద్, అక్కన్నపేట ఎస్ఐలు మహేశ్, వివేక్ తదితరులున్నారు.

బెజ్జంకిలో..

బెజ్జంకి, మే 8: ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు జరుపుకోవాలని, బాధ్యతాయుతంగా ప్రజలు ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్ఐ కృష్ణారెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండల కేంద్రంలో, గుండారం గ్రామంలో కేంద్ర సాయుధ బలగాలతో పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఎన్నికల నిబంధనలు ఉల్లఘించే వారిపై ప్రత్యేక నిఘాఉంటుందని, ఎన్నికల సంఘం ఉత్తర్వులను ఎవరు ధిక్కరించినా చర్యలు తప్పవని ఎస్ఐ కృష్ణారెడ్డి హెచ్చరించారు. ఆయనవెంట సిద్దిపేట రూరల్ ఎస్ఐ అపూర్వ రెడ్డి, పోలీస్ సిబ్బంది, కేంద్ర బలగాలు పాల్గొన్నాయి.

బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగానికి ప్రమాదం

● సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి



హుస్నాబాద్ మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న చాడ వెంకటరెడ్డి

హుస్నాబాద్, మే 8 : కేంద్రంలో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే భారత రాజ్యాంగానికి ప్రమాదమని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి అన్నారు. బుధవారం హుస్నాబాద్ పట్టణంలో ఆయన కాంగ్రెస్ తరఫున ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మతోన్మాద బీజేపీని ఓడించి ఇండియా కూటమి అధికారంలోకి వచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ప్రధాని మోదీ పదేండ్ల పాలనలో ఏ వర్గానికి కూడా రక్షణ లేకుండా పోయిందన్నారు. అలాగే, అకాల వర్షంతో తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని, దెబ్బతిన్న మామిడి, బత్తాయి రైతులకు నష్టపరిహారం అందించాలని చాడ వెంకటరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం హుస్నాబాద్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. ఆయా కార్యక్రమాల్లో సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు గడిపె మల్లేశ్, కాంగ్రెస్ నాయకులు చిత్తారి రవీందర్, కౌన్సిలర్లు చిత్తారి పద్మ, భూక్య సరోజన, అయిలేని సంజీవరెడ్డి, పద్మ, సుదర్శనచారి, జనగామ రాజ్‌కుమార్, మల్లారెడ్డి, విజయ తదితరులున్నారు.

బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా మల్లేశం

సిద్దిపేట అర్బన్, మే 8: జాతీయ బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా సిద్దిపేటకు చెందిన ఉడత మల్లేశం యాదవ్ నియామకం అయ్యారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ.. నేషనల్ బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నట్లు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు. బీసీ సంక్షేమం కోసం కృషి చేస్తామని అన్నారు.

బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించడంతో జరిమానా

చేర్యాల, మే 8: బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించిన కొమురవెల్లి మండలానికి చెందిన పలువురికి జరిమానా విధించినట్లు కొమురవెల్లి ఎస్ఐ నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో ఇటీవల పలువురు బెల్ట్‌షాప్ నిర్వహకులను తహసీల్దారు ఎదుట బైండోవర్ చేశామన్నారు. కానీ బైండోవర్ నిబంధనలను ఉల్లంఘిస్తూ మళ్లీ బెల్ట్‌షాప్ నిర్వహించిన వారిని కొమురవెల్లి తహసీల్దారు ఎదుట హాజరుపరచామని, దీంతో పొన్నం సత్తయ్యకు రూ.25వేలు, లింగంపల్లి కనకయ్యకు రూ.25వేలు, తొడపునూరి రమేశ్‌కు రూ.25వేలు, మాదాసు చంద్రయ్యకు రూ.10వేలు, ఆకుల ఎల్లయ్యకు రూ.15వేలు చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు.

ఆలయంలో చోరీ

మిరుదొడ్డి, మే 8: మిరుదొడ్డి మండలం ధర్మారం గ్రామంలోని మహంకాళీ ఆలయంలో బుధవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. మిరుదొడ్డి పోలీసులకు సమాచారం అందించడంతో అక్కడికి చేరుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామంలోని మహంకాళీ దేవాలయంలోని అమ్మవారి రెండు బంగారు ముక్కుపుడకలు, వెండి ఆభరణాలతోపాటు ఆలయంలోని హుండీని ఎత్తుకెళ్లారు. ఆలయ కమిటీ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు స్థానిక ఎస్ఐ పరుశురాములు తెలిపారు.

పాముకాటుతో గేదె మృతి

మిరుదొడ్డి, మే 8: పాముకాటుతో పాడిగెదె మృతిచెందిన ఘటన మంగళవారం మిరుదొడ్డిలో జరిగింది. మిరుదొడ్డి గ్రామానికి చెందిన బొయిని పెంటయ్య పాడిగెదె వ్యవసాయ పొలం పాముకాటుతో మృతిచెందినట్టు తెలిపారు. దీంతో బాధితుడికి సుమారు 80వేల నష్టం వాటిల్లినట్టు బోరున విలపించారు. తన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

పిడుగుపాటుతో..

దౌల్తాబాద్,మే 8: పిడుగుపాటుకు ఓ పాడిగేదె మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని దొమ్మాట గ్రామంలో మంగళవారం రాత్రి చోటుచేసుకున్నది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం... దొమ్మాట గ్రామానికి చెందిన కొమ్ము రాజయ్య మంగళవారం సాయంత్రం తన పొలం వద్ద పాడి గేదను కట్టేశాడు. మంగళవారం రాత్రి ఉరుములు మెరుపుల వర్షంలో పిడుగు పడి పాడి గేద మృతి చెందిదని తెలిపాడు. మృతి చెందిన గేదె విలువ సుమారు రూ.45 వేలు ఉంటుందని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని బాధిత రైతు రాజయ్య కోరాడు.

ఘనంగా 'పొన్నం' పుట్టిన రోజు



కేక్‌ను కట్‌చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్‌రూరల్, మే 8: రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదిన వేడుకలు బుధవారం హుస్నాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. మంత్రి తన జన్మదినం సందర్భంగా హుస్నాబాద్ పట్టణంలోని రేణుకాఎల్లమ్మ ఆలయంలో, హుస్నాబాద్ మండలం పొట్లపల్లి స్వయంభూ రాజేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, వేదపండితుల ఆశీర్వచనలు పొందారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజలు, కార్యకర్తల మధ్య కేక్‌కట్ చేసి స్వీట్లు పంచారు. అనంతరం రెడ్డి బంధువులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేక్‌కట్‌ను చేశారు. రెడ్డి కార్పొరేషన్ సొసైటీకి రూ. 50 లక్షలు మంజూరు చేసినందుకు రెడ్డి సొసైటీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు ఉన్నారు.

వర్గల్‌లో బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం



వర్గల్ కేంద్రంలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

వర్గల్, మే 8 : బీఆర్ఎస్ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి వెంకట్రామా రెడ్డికి ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వేలూరి వెంకట్‌రెడ్డి కోరారు. మండల కేంద్రంలో బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరంతరం ప్రజల కోసం శ్రమిస్తున్న మాజీ సీఎం కేసీఆర్‌కు నమ్మకస్థుడైన వెంకట్రామారెడ్డికి ప్రజలంతా ఓటు వేసి పార్లమెంట్‌కు పంపించాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీటీసీ బాలుయాదవ్, పీఏసీఎస్ చైర్మన్ రామకృష్ణరెడ్డి, జిల్లా యూత్ అధ్యక్షుడు నాగరాజు, నాయకులు రమేశ్‌గౌడ్, వెంకటేశ్‌గౌడ్, కరుణకర్, స్వామి, వేలూరి కృష్ణరెడ్డి, తదితరులు ఉన్నారు.

కొమురవెల్లిలో సామాజిక తనిఖీ

చేర్యాల, మే 8 : ఉపాధిహామీ పథకం ద్వారా కొమురవెల్లి మండలంలోని 11గ్రామాలలో చేపట్టిన పనులపై బుధవారం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా కొమురవెల్లి ఎంపీడీవో కార్యాలయంలో అడిషనల్ డీఆర్‌డీవో బాలకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తనిఖీ బృందం, సిబ్బంది పలు అవకతవకలను గుర్తించారు. దీంతో అవకతవకలకు పాల్పడిన పలువురికి రూ.36,134 జరిమానా విధించినట్లు అడిషనల్ డీఆర్‌డీవో బాలకృష్ణ పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు చిత్తశుద్ధితో వ్యవహరించాలన్నారు. మస్టర్ నిర్వహణ సక్రమంగా చేపట్టడం లేదని, అందుకు పంచాయతీ కార్యదర్శులే బాధ్యులవుతారన్నారు. పని జరిగే ప్రదేశాల్లో కూలీలకు నీడ, తాగునీటివసతి కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో విజిలెన్స్ అధికారి ప్రభాకర్, ఏపీడీ శివాజీ, అంబుడ్స్‌మెన్ ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

'లక్ష మంది భక్తులకు ముత్యాల తలంబ్రాలు'

గజ్వేల్, మే 8: లక్ష మందికి భక్తులకు ముత్యాల తలంబ్రాలను అందజేస్తామని శ్రీరామకోటి భక్త సమాజం అధ్యక్షుడు రామకోటి రామరాజు అన్నారు. భద్రాచల రాముల వారి ముత్యాల తలంబ్రాలు గజ్వేల్‌కు చేరుకోగా, అద్దాల మందిరం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లక్ష మంది భక్తులకు తమ సంస్థ ద్వారా ఈ ముత్యాల తలంబ్రాలను అందజేస్తామని ఆయన చెప్పారు.

తాగునీటికి ఇబ్బందులు రాకుండా చూడాలి

● ఎంపీపీ మాలోతు లక్ష్మి



మాట్లాడుతున్న ఎంపీపీ మాలోతు లక్ష్మి

అక్కన్నపేట, మే 8: తాగునీటికి ఇబ్బందులు రాకుండా చూడాలని మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు ఎంపీపీ మాలోతు లక్ష్మి సూచించారు. బుధవారం అక్కన్నపేట మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఆమె అధ్యక్షతన నిర్వహించారు. అక్కన్నపేట, చౌటపల్లి, కేశవాపూర్, పంచరాయితండా, కట్కూర్ గ్రామాల్లో మిషన్ భగీరథ నీరు రావడంలేదని ఎంపీటీసీలు పెసరు సాంబరాజు, గంగాధరి సుగుణ, భూపతి సుధీష్ణ, తదితరులు సభ దృష్టికి తీసుకువచ్చారు. రామవరంలో ఇటీవల పారిశుద్య కార్మికుడు అనారోగ్యంతో మరణించగా, ఆ కార్మికునికి లేబర్ కార్డు ద్వారా బీమా చేయించవలసి ఉండగా , ఆ గ్రామ కార్యదర్శి చేయించకుండా నిర్లక్ష్యం చేయడంతో ఆ కుటుంబానికి ఆర్థికంగా ఎలాంటి సహాయం అందడం లేదని, నిర్లక్ష్యం వహించిన కార్యదర్శి పై చర్యలు తీసుకోవాలని రామవరం ఎంపీటీసీ లింగాల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో గ్రామాల్లో ఎలాంటి సమస్యలు లేకుండా పరిష్కరించాలని కోరారు. ఇందులో జడ్పీటీసీ భూక్య మంగ, ఎంపీడీవో బానోతు జయరామ్, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఏఐసీసీ ఎన్నికల ఖర్చుకు తెలంగాణ ఖజానా ఖాళీ

● ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



దొమ్మాటలో మాట్లాడుతున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల, మే 8: అసెంబ్లీ ఎన్నికలముందు బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధుకు కేటాయించిన రూ.7,500 కోట్లను అందించకుండా ఎన్నికల కమిషన్ ద్వారా అడ్డుకుని కాంగ్రెస్ మోసం చేసిందని, ప్రస్తుతం ఆయా నిధులను రైతులకు ఇవ్వకుండా ఏఐసీసీ ఎన్నికల ఖర్చుతో పాటు మంత్రులు, కాంట్రాక్టర్లకు చెల్లించి ప్రభుత్వ ఖజానాను ఖాళీ చేసిందని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ఆరోపించారు. బీఆర్ఎస్ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి క్యామ మల్లేశ్‌కు మద్దతుగా బుధవారం చేర్యాల మండలంలోని వీరన్నపేట, ముస్త్యాల, చుంచనకోట, రాంపూర్, కాశీగుడిసెలు, ఆకునూరు, కొత్తదొమ్మాట, గుర్జకుంట, దొమ్మాట, తాడూరు, చిట్యాల, దానంపల్లి గ్రామాలలో ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్యాగాల పునాదులపై ఆవిర్భవించి స్వరాష్ట్రాన్ని సిద్ధింపచేసిన బీఆర్ఎస్‌కు తెలంగాణపై ఉన్న ప్రేమ బీజేపీ, కాంగ్రెస్‌లకు ఎందుకు ఉంటుందన్నారు. ఎన్నికలముందు అలవిగాని హామీలిచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి పంట రుణమాఫీ, రైతుబంధు, సాగునీరు, బోనస్‌ధర అందించకుండా ప్రజలను వంచిస్తున్నారన్నారు. కాంగ్రెస్ కల్లబొల్లి కబుర్లను నమ్మి అసెంబ్లీ ఎన్నికలలో మోసపోయారని, ప్రజలు మరోమారు మోసపోకుండా బీఆర్ఎస్‌ను గెలిపించాలన్నారు.

మోదీ సారథ్యంలో అగ్రస్థానంలో దేశం

● బీజేపీ నాయకులు

నారాయణరావుపేట, మే 8: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సారథ్యంలో దేశం అగ్రస్థానంలో నిలించిందని బీజేపీ మండల అధ్యక్షుడు పొన్నాలబాబు అన్నారు. మండలంలోని ఇబ్రహీంపూర్, మల్యాల, లక్ష్మీదేవిపల్లి గ్రామాల్లో బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. లక్ష్మీదేవిపల్లి గ్రామంలో వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు బీజేపీలో చేరారు. మోదీ విధానాలకు ఆకర్షితులై పలు గ్రామాల నుంచి కార్యకర్తలు, నాయకులు చేరుతున్నారని తెలిపారు. మండల వ్యాప్తంగా బీజేపీ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి రఘునందన్‌రావుకు భారీ మెజార్టీ వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి రమేష్ గౌడ్, నాయకులు అరవింద్, స్వామియాదవ్, అజిత్, భాస్కర్, శ్రీకాంత్, మల్లయ్య, రవి గౌడ్, రజినీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



నారాయణరావుపేట: వివిధ పార్టీల నుంచి బీజేపీలో చేరుతున్న కార్యకర్తలు



వర్గల్: మినాజీపేటలో ఉపాధిహమీ కూలీలతో మాట్లాడుతున్న బాల్‌రెడ్డి

బీజేపీకి అండగా నిలవాలి

వర్గల్, మే 8: ప్రజలంతా సనాతనధర్మ పరిరక్షణ కోసం బీజేపీకి అండగా నిలవాలని బీజేపీ మండల అధ్యక్షుడు టేకులపల్లి బాల్‌రెడ్డి కోరారు. మండల పరిధిలోని మినాజీపేట, తునికిమక్తా గ్రామాల్లో బీజేపీ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి రఘునందన్‌రావుకు మద్దతుగా ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అమలు చేసిన పథకాలు ప్రతి గ్రామంలో ప్రజలకు అందాయన్నారు. రఘునందన్‌రావుకు ఓటు వేసి బీజేపీని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు శ్రీరాం శ్రీకాంత్, నాయకులు పంజాల వెంకట్, నాగరాజు, రమేశ్, ప్రదీప్, రవీందర్, తిరుపతిరెడ్డి, రాజేశ్, శ్రీనివాస్ రెడ్డి, నరేందర్‌రెడ్డి, యశ్వంత్‌రెడ్డి పాల్గొన్నారు.

మానసిక ఆందోళనతో వ్యక్తి ఆత్మహత్య

రాయపోల్, మే 8: ఉరేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని అనాజీపూర్‌లో బుధవారం చోటుచేసుకున్నది. కుటుంబ సభ్యులు, ఎస్ఐ రఘుపతి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన అల్లాడి సత్తయ్య(45) నెల రోజుల క్రితం జారి పడడంతో కాలు విరిగింది. డాక్టర్లు చికత్స చేసి ఆయన కాలుకు రాడ్ వేశారు. అప్పటి నుంచి ఆయన మానసికంగా కుంగిపోయాడు. మానసిక ఆందోళనకు గురైన అతడు 20 రోజుల నుంచి తాను ఆత్మహత్య చేసుకుంటానని కుటుంబసభ్యులతో అంటున్నాడు. బుధవారం సాయంత్రం ఇంట్లో నుంచి వెళ్లి తన వ్యవసాయ పొలం వద్ద చెట్టుకు ఉరేసుకున్నాడు. గమనించిన గ్రామస్తులు కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుని భార్య అల్లాడి మంజుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తాడిచెట్టు కూలి వ్యక్తి మృతి

మద్దూరు, మే 8: తాడిచెటు కూలి ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన మంగళవారం సాయంత్రం జరిగింది. చేర్యాల మండలం అర్జునపట్ల గ్రామంలోని సింప్లీ ఫ్రెష్ కంపెనీ ఆవరణలోని రేకులషెడ్డుపై తాటిచెట్టు కూలి పశ్చిమబెంగాల్‌కు చెందిన అమల్ రేబ్‌నాథ్(33) మరణించాడు. ఈ సంఘనటకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... కంపెనీలో గ్రీన్‌హౌజ్ నిర్మాణం కోసం హైదరాబాద్ వీటీసీ కంపనీకి కాంట్రాక్టు ఇవ్వడంతో, పశ్చిమబెంగాల్‌కు చెందిన కూలీలతో పనులు చేయిస్తున్నారు. వారికి కంపెనీ ఆవరణలోని ఖాళీస్థలంలో రేకుల షెడ్డులో ఆశ్రయం కల్పించారు. మంగళవారం వారాంతపుసెలవు కావడంతో గదిలో ఉండగా, మంగళవారం సాయంత్రం వీచిన బలమైన ఈదురుగాలుకు సమీపంలోని తాటిచెట్టు విరిగి పడింది. దీంతో గదిలో ఉన్న రేబ్‌నాథ్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయమై కంపెనీ మేనేజర్ వెంకటేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మద్దూరు పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ షేక్ యూనస్ అహ్మద్ అలీ తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

దుబ్బాక, మే 8: విద్యుదాఘాతంతో వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన దుబ్బాక మండలం పెద్దచీకోడ్ గ్రామంలో బుధవారం చోటుచేసుకున్నది. కుటుంబసభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన వల్లెపు రాములు(55) గ్రామంలో నూతనంగా ఇల్లు నిర్మించుకుంటున్నాడు. అక్కడ నీళ్ల పడుతుండగా ప్రమాదవత్తు విద్యుత్తుమోటర్ వైరు తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలికి చేరుకున్నారు. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని తాజామాజీ సర్పంచు తౌడశ్రీనివాస్ కోరారు.

కూటిగల్‌లో గుర్తుతెలియని జంతువు దాడి

● లేగదూడ మృతి

ధూళిమిట్ట, మే 8: మండలంలోని కూటిగల్ గ్రామంలో మంగళవారం రాత్రి గ్యానబోయిన శ్రీనివాస్ వ్యవసాయ పొలం వద్ద పశువుల పాకలో కట్టేసిన లేగదూడపై గుర్తుతెలియని జంతువు దాడి చేసి, మెడ భాగంలో తీవ్రంగా గాయపరించింది. తీవ్రగాయాలతో కొట్టుమిట్టడుతూ లేగదూడ బుధవారం మృతి చెందింది. ఈ ఘటనతో గ్రామంలోని రైతులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ ప్రాంతంలో హైనా తిరుగుతున్నట్లు కొంతమంది రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అటవీశాఖ అధికారులు గ్రామాన్ని సందర్శించి, దాడి చేసిన జంతువును బంధించాలని రైతులు, గ్రామస్థులు కోరుతున్నారు

పేకాట స్థావరంపై పోలీసుల దాడి



పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు, ఫోన్లు

గజ్వేల్, మే 8: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని రాజిరెడ్డిపల్లిలో పేకాట స్థావరంపై సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, గజ్వేల్ పోలీసులు దాడులు నిర్వహించారు. ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.7వేల నగదు, మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు గజ్వేల్ సీఐ సైదా తెలిపారు. ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు మాట్లాడుతూ.. పట్టణాల్లో, గ్రామాల్లో, ఫాంహౌజ్‌లలో, బహిరంగ ప్రదేశాల్లో పేకాట, జూదం, మరే ఇతర చట్ట వ్యతిరేఖమైన కార్యక్రమాలకు పాల్పడిన వెంటనే పోలీసులకు సమాచారం తెలియజేయాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసిన నాయకులు

జగదేవ్‌పూర్, మే 8: సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం వట్టిపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, గ్రామస్తులు మాజీ సీఎం కేసీఆర్‌ను ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో బుధవారం సాయంత్రం కలిశారు. ఈ సందర్భంగా వారు గ్రామంలోని రోడ్డు విస్తరణ సమస్యను ఆయన దృష్టికి తీసుకువచ్చినట్టు తెలిసింది. మునిగడప కొండపోచమ్మకు వెళ్లే ప్రధాన రోడ్డు నుంచి గ్రామం మధ్య నుంచి, సరిహద్దులోని జనగాం జిల్లా బచ్చన్నపేట మండలం సాల్వాపూర్‌కు వెళ్లే లింకు రోడ్డు మంజూరు చేసినప్పటికీ, పనులు ప్రారంభం కాలేదని, కాంగ్రెస్ గవర్నమెంట్ వచ్చిన తర్వాత ఆ రోడ్డును క్యాన్సిల్ చేసినట్టుగా తెలిసిందని చెప్పారు. దీనిపై మాజీ సీఎం కేసీఆర్ స్పందిస్తూ, ఎలక్షన్ కోడ్ అమలులో ఉన్నందున వీటి గురించి మాట్లాడలేమని, ఎన్నికలు పూర్తయిన తర్వాల గ్రామస్థులతో మరోసారి సమావేశ మై చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్టు బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్, కరుణాకర్, రాములు, తలారి రమేశ్, నర్సింహులు, కనకయ్య, మోహన్‌రెడ్డి, బాలయ్య ఎల్లయ్య, మల్లయ్య, సూరి, కిషన్ ఉన్నారు

'ప్రకృతితో మమేకం అయితే ప్రతిధ్వని సంగీతమే అవుతుంది'

జగదేవ్‌పూర్, మే 8: చిన్నప్పటి నుంచి ప్రకృతితో మమేకం అయితే ప్రతిధ్వని సంగీతమవుతుందని సంగీత విద్యాంసులు, చిల్డ్రన్ మ్యూజిక్ అకాడమీ వ్యవస్థాపకులు రామాచారి అన్నారు. మంగళవారం రాత్రి జగదేవ్‌పూర్ మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్లో నిర్వహించిన చిన్నయ్య మిషన్ చిల్డ్రన్స్ వేసవి శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అడుగులు వేస్తే జీవితం నందనవనం అవుతుందన్నారు. తమ సంస్థ ఆధ్వర్యంలో చిన్నారులకు ఉచితంగా తమ అకాడమీ తరఫున సంగీతం నేర్పిస్తున్నామని అన్నారు. అనంతరం చిన్నారులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమానికి స్థానిక ఎస్ఐ చంద్రమోహన్, యజ్ఞానంద స్వామిజి, అధ్యక్షుడు పేర్ల సత్తయ్య సభ్యులు సముద్రాల హరినాథ్, బాల్‌రాజు, వెంకటరెడ్డి, కృష్ణ, చిన్నారులు, వివిధ గ్రామాల ప్రముఖులు పాల్గొన్నారు.

వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పంటల పరిశీలన

మద్దూరు, మే 8: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం సాయంత్రం కురిసిన అకాల వర్షానికి దెబ్బతిన్న పంటల్ని, బుధవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఏఈవో రాకేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఈవో రాకేష్ మాట్లాడారు. ధర్మారం, గాగిళ్లాపూర్, మద్దూరు గ్రామాల్లో వరి పంట పొలాలతో పాటు మామిడి పంటలు పాక్షికంగా దెబ్బతిన్నట్టు తెలిపారు. నివేదిక తయారుచేసి ఉన్నతాధికారులకు అందించనున్నట్లు తెలిపారు.



గాగిళ్లాపూర్‌లో పొలాన్ని పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

మండలంలో మంగళవారం సాయంత్రం కురిసిన ఆకాల వర్షంతో చేతికొచ్చిన పంటలు నేలపాలు అయ్యాయని, పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఎకరానికి రూ.15 వేలు అందించి ఆదుకోవాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మేక సంతోష్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బుధవారం మండలంలోని గాగిళ్లాపూర్‌లో రైతుల పంట పొలాలను పరిశీలించి మాట్లాడారు. రైతులు పూర్తిస్థాయిలో వరి కోతలు ప్రారంభించలేదని, అకాల వర్షానికి పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించేందుకు క్షేత్రస్థాయిలో వ్యవసాయాధికారులచే పర్యవేక్షణ జరిపించి, నష్టపరిహారం అందించే విధంగా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బొల్లు చంద్రమౌళి, మేక మల్లేశంతో పాటు పలువురు రైతులున్నారు.



చేర్యాల: ధ్వంసమై నేలకూలిన కాటన్ ఇండస్ట్రీస్ రేకులషెడ్డు

విద్యుత్ లైన్ పునరుద్ధరణ

మండలకేంద్రంలో మంగళవారం సాయంత్రం వీచిన ఈదురు గాలులకు విరిగి పడిన విద్యుత్ స్తంభాల పునరుద్ధనకు చర్యలు చేపట్టినట్లు విద్యుత్ ఏఈ సుధీర్ బాబు తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో విరిగిపోయిన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్త వాటిని వేసి విద్యుత్ లైన్లను పునరుద్ధరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

బీభత్సం సృష్టించిన వర్షం

చేర్యాల, మే 8 : చేర్యాల, కొమురవెల్లి మండలాలలోని ఆయా గ్రామాల్లో మంగళవారం సాయంత్రం కురిసిన అకాల వర్షానికి ఆపార నష్టం వాటిల్లింది. మామిడితోటలు, పంటపొలాలు దెబ్బతిన్నాయి. బలమైన ఈదురుగాలులకు చేర్యాల పట్టణ శివారులోని ఓ కాటన్ ఇండస్ట్రీస్ రేకులషెడ్డు పైకప్పు ఎగిరిపోయి సమీపంలోని వ్యవసాయబావుల వద పడింది. దీంతో రూ.70లక్షల నష్టంవాటిల్లింది. చుట్టుపక్కల రైతులు ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. అలాగే సమీపంలోని ఓ పౌల్ట్రీ ఫారం షెడ్డుకూలిపోయింది. చేర్యాల మండలం దొమ్మాట గ్రామంలో ఎలుముల నాగయ్య ఇంటి సిమెంటురేకుల పైకప్పు గాలివాన బీభత్సానికి ఎగిరిపోయింది.